క్లుప్తంగా

సంగీతంతో మేధో వికాసం


డాక్టర్ మండపాక రవిని సత్కరిస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కృష్ణశాంతి, తదితరులు

విజయనగరం టౌన్: మానవ మేధస్సును పెంపొందించుకోవడానికి సంగీతమే సరైన సాధనమని ప్రముఖ మృదంగ విద్వాంసులు డాక్టర్ మండపాక రవి పేర్కొన్నారు. స్థానిక రోటరీ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో 'సంగీతం ఒక సాధనం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. అనంతరం సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంతృప్తకరమైన సమాధానలిచ్చి, కరతాళ ధ్వనులందుకున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ ఐ.కృష్ణశాంతి, కార్యదర్శి నీతూ విజ్వానీ, డీఎస్‌ఆర్ స్కూల్ అధ్యక్షుడు ఉసిరికల చంద్రశేఖరరావు, సభ్యులు సుధాకర్, రొటేరియన్లు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

మంత్రి బొత్సను కలిసిన కడుబండి


మంత్రి బొత్సను కలిసిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

వేపాడ: మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు విశాఖపట్నంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్.కోట నియోజకవర్గంలో పోలింగ్ సరళిని మంత్రి బొత్సకు ఎమ్మెల్యే కడుబండి వివరించారు. మంత్రి బొత్స ను కలిసిన వారిలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరాము నాయుడు, తదితరులు ఉన్నారు.

ఓటర్లకు కృతజ్ఞతలు


ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం: తనకు మద్దతు తెలిపిన ఓటర్లందరికీ కృతజ్ఞతలని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ తెలిపారు. సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగ్గా స్థానిక పట్టణంలోని ఆయన స్వగృహంలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ చాలా గ్రామాల్లోని ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. రాత్రి 10 గంటలైనా ఓటర్లు ఎంతో ఓపికతో క్యూలైన్లలో నిలబడి ఓట్లు వేసి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కనబరిచారన్నారు. తనకు మద్దతు తెలిపిన పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, బంధువులకు ధన్యవాదాలన్నారు. రాజాంలో తన గెలుపు ఖాయమన్నారు.

భానుడి ప్రతాపం


రామభద్రపురంలో గొడుగు నీడలో నడిచి వస్తున్న మహిళలు

రామభద్రపురం: భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 9 గంటలకే తీవ్రమైన ఎండ కాయడంతో పాటు ఉదయం 11.30 గంటల నుంచే వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో అవసరాల నిమిత్తం బయటకు వచ్చేందుకు కూడా ప్రజలు బెంబేలెత్తున్నారు. రోజురోజుకూ ఎండలు పెరిగిపోవడంతో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు కూడా ఉదయం 10 గంటలకే ఇళ్లకు చేరుకుంటున్నారు. ప్రయాణికులు సైతం తమ ప్రయాణాలను ఉదయమే ఉండేలా చూసుకుంటున్నారు. వేసవి ఎండల నేపథ్యంలో ఎప్పుడూ ప్రయాణీకులతో రద్దీగా ఉండే రామభద్రపురం జాతీయ రహదారి మంగళవారం నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. ఎండల వేడి తట్టుకోలేక మధ్యాహ్నం 12 గంటలకే వ్యాపారులు తమ దుకాణాలు మూసివేశారు. ఇదే పరిస్థితి ఇంకెన్నాళ్లు కొనసాగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన వేసవి శిక్షణా తరగతులు

రాజాం సిటీ: స్థానిక వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞ వేసవి ఉచిత శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. పది రోజుల పాటు కొనసాగిన ఈ శిక్షణలో మన ఋషులు, పంచతంత్ర కథలు, నీతి పద్యాలు, శ్లోకాలు, రామాయణంలోని బాలకాండ, యోగాసనాలు వంటి వాటిని వివరించామని వికాస తరంగిణి అధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి తెలిపారు. అలాగే క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు సైతం అందజేసి, ప్రోత్సహించామన్నారు. ఇటువంటి తరగతులు చిన్నారుల్లో జ్ఞాపకశక్తి పెరిగేందుకు దోహదపడడంతో పాటు మన సంస్కృతీ, సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.కృష్ణారావు, ప్రజ్ఞ కో-ఆర్డినేటర్ ఎం.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీదే విజయం


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావటం ఖాయం
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో అత్యధిక స్థానాలు దక్కించుకుంటాం
- ఓటమి భయంతో చంద్రబాబు కూటమి రాజకీయాలు
- ఓటు వేసిన ప్రజలందరికీ పార్టీ తరఫున ధన్యవాదాలు
- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ దంఖా మోగిస్తుందని, రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్ సీపీ విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమం, అభివృద్ధి పాలనను చూసి ప్రజలు స్వచ్ఛందంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని, వారందరికీ పార్టీ తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలన, సంక్షేమ పథకాలు, 2019లో ఇచ్చిన హామీల అమలు, ఇంటి వద్దకే పథకాల చేరవేత, తదితర అన్ని అంశాలతో ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. ఇదే పోలింగ్ సరళి పెరిగేందుకు కారణమని అభిప్రాయం వ్యక్తం చేశారు. చంద్రబాబు గత పరిపాలన, మోసపూరిత వాగ్దానాలు, 2014లో మేనిఫెస్టో అమలు చేయని విధానం ప్రజలందరూ గుర్తుచేసుకుని వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారని పేర్కొన్నారు.

ఉమ్మడి విజయనగరంలో అత్యధిక స్థానాలు మావే..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో గతంలో మాదిరిగా అత్యధిక స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందన్నారు. విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా తాను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్ మంచి మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా పార్టీ శ్రేణులు ఎంతో ఉత్సాహంతో పనిచేశారని, కోవిడ్ సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డారని గుర్తుచేసుకున్నారు. పట్టణంలో మౌలిక సదుపాయాలు, నగర సుందరీకరణ, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేందుకు ఎంతగానో కృషి చేశారన్నారు. వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవలందించడం వైఎస్సార్‌సీపీ విజయానికి కలిసి వచ్చే అంశాలుగా పేర్కొన్నారు. మరలా రాష్ట్రంలో సుపరిపాలన తెచ్చేందుకు ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఓటు ద్వారా మద్దతు తెలియజేశారని అన్నారు.

ఓటమి భయంతోనే కూటమి కట్టారు..

ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి ఎన్నికలలో ఓడిపోతామనే భయంతో, జగన్ను ఎదిరించే సాహసం చేయలేక ప్రతిపక్ష పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని కోలగట్ల ఎద్దేవా చేశారు. కూటమిలో కూడా సమన్వయ లేకపోవడాన్ని ప్రజలందరూ గమనించారన్నారు. చివరికి గెలుపుకోసం దిగజారుడు రాజకీయాలు చేశారని దుయ్యబట్టారు. అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబు ఎన్నికల ఏజెంట్ల గుర్తింపు కార్డులను కూడా పసుపు రంగులో వచ్చే విధంగా ఎన్నికల అధికారులను ప్రలోభాలకు గురి చేశారని ఆరోపించారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి ఇలాంటి చేష్టలు చేపట్టడం ప్రజలందరూ గమనించారని అన్నారు. నియోజకవర్గంలో కార్పొరేటర్లు, మండల పరిషత్ నాయకులు, పార్టీ శ్రేణులు, మహిళలు, పార్టీ యువత అందరూ సమన్వయంతో ఈ ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు చేసిన కృషి అభినందనీయమని అన్నారు. సమావేశంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జెడ్పీటీసీ కెల్ల శ్రీనివాసరావు, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జోనల్ ఇన్‌ఛార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ ముఖ్యమంత్రి కావాలని పూజలు

రేగిడి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మండలంలోని కందిశ గ్రామస్తులు.. ఒడిశాలోని రాయగడలో ఉన్న మజ్జిగౌరమ్మకు మంగళవారం పూజలు చేశారు. ఈ ఐదేళ్లు ప్రజలకు ఎన్నోవిధాలా మేలు చేసిన జగనన్నే మళ్లీ మళ్లీ సీఎం అయ్యేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నామని, జూన్ 4వ తేదీన వెల్లడయ్యే ఎన్నికల ఫలితాలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉండాలని పూజించినట్లు సర్పంచ్ కెల్ల మన్మథరావు తెలిపారు.

• నూతన కార్యవర్గం ఎంపిక


ఆర్.ఎస్.జాన్‌ని సత్కరిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో మంగళవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రెవరెండ్ మధుమనోహర్, ఉపాధ్యక్షుడిగా రెవరెండ్ భాను శామ్యూల్, కార్యదర్శిగా ఎస్.పాల్, సహాయ కార్యదర్శిగా ఆర్.బాల, కోశాధికారిగా శ్రీనివాస్ పాల్, సహాయ కోశాధికారిగా స్టీఫెన్ ఎంపికయ్యారు. ఆర్చ్ బిషప్ పిరిడి పాల్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా టౌన్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గమంతా కలిసి జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఆర్.ఎస్.జాన్‌ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రీస్తు విశ్వాసకులు పాల్గొన్నారు.

అంతటా ఒకటే చర్చ..!

- బెట్టింగ్‌లు జోరు
- మెజార్టీలపై ఊహాగానాలు
- లెక్కల్లో పార్టీల నేతలు

శృంగవరపుకోట: సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో భద్రం అయ్యింది. సోమవారం రాత్రి వరకూ పోలింగ్ పోరులో నిమగ్నం అయి రాజీలేని రాజకీయ పోరాటం చేసిన నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు అంతా మంగళవారం ఉద యం నుంచి లెక్కలు కట్టే పనిలో నిమగ్నమయ్యారు. మంగళవారం ఉదయం నుంచి ప్రతి ఇద్దరీ మధ్య ఎస్.కోటలో ఎవరు పాగా వేస్తారు. ఎంత మెజార్టీ వస్తుంది. ఏ గ్రామంలో పోలింగ్ ఎలా సాగింది. అభ్యర్థుల్లో అనుకూల పవనాలు ఎవరివైపు వీస్తున్నాయన్న చర్చలే సాగుతు న్నాయి. బస్సుల్లో, ఆటోల్లో, సెలూన్లలో, హోటళ్లలో ఇలా ప్రతి చోట అందరి నోటా ఎన్నికల్లో అభ్యర్థుల విజయావకాశాలపైనే సుదీర్ఘ చర్చలు నడుస్తున్నాయి. ఎవరిస్థాయిలో వారు తమకు తెలిసింది, అక్కడ ఇక్కడ విన్న గాసిప్స్ అన్నీ కలిసి తమ వాదనే నిజం అని నిరూపించే ప్రయత్నం చేస్తున్నారు.

బెట్టింగ్‌ల జోరు

ఇటు అధికార వైఎస్సార్‌సీపీ అటు ప్రతిపక్ష తెలుగుదేశం వర్గాల మధ్య కొన్ని గ్రామాల్లో బెట్టింగ్‌ల జోరు సాగుతోంది. కొందరు పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థి గెలుపుపై పందాలు కాస్తుండగా, మరి కొందరు స్థానిక అభ్యర్థులపై పందాలు ఒడ్డుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఆసక్తిగా తమ గ్రామాల్లో పార్టీలు సాధించే మెజార్టీలపై పందాలు కాస్తున్నారు. దీంతో క్రమంగా రాజకీయ చర్చలు ఊపందుకుంటున్నాయి. గ్రామాల వారీగా, బూత్‌ల వారీగా పోలైన ఓట్లు ఆయా గ్రామాల రాజకీయ పరిస్థితులపై తమ బంధువులు, స్నేహితులు, తమ పార్టీల మనుషుల ద్వారా సమాచారం తెలుసుకోవడానికి ఆరాటపడుతున్నారు.

మెజార్టీలపై ఊహాగానాలు

ఎస్.కోటలో మెజార్టీ సాధిస్తామంటూ రెండు పార్టీల నేతలు గట్టిగా చెబుతున్నారు. ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. గతం పరిస్థితి మార్చేసాం గట్టి మెజార్టీ సాధిస్తామని టీడీపీ వారు చెబుతుండగా, 'కోట'లో మరోదపా అధికారం మాదేనని, సైలెంట్ ఓటింగ్ జరిగిందని, మహిళాఓటర్లు మాకు అండ అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు అంటున్నారు. దీంతో పార్టీల నేతలు అంతా గ్రామాల్లో ఉన్న తమ నాయకుల ద్వారా వివరాలు తెలుసుకుని బూత్‌ల వారీగా తమకు పోలైన ఓట్లు లెక్కలు కట్టుకునే పనిలో బిజీగా ఉన్నారు.

నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం పని చేసిన నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక బెల్లాన కన్వెన్షన్ హాల్‌లో దత్తిరాజేరు, గంట్యాడ, గజపతినగ రం, బొండపల్లి, జామి మండలాల నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశమయ్యారు. మండలాల వారీగా నాయకులతో మాట్లాడి పోలింగ్ సరళి, బూత్‌ల వారీగా పార్టీకి వచ్చే ఓట్లపై ఆరా తీశారు. అన్ని మండలాల నుంచి వైఎస్సార్ సీపీకి మెజార్టీ వస్తుందని, గెలుపుపై ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణమూర్తి రాజు, పార్టీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, గజపతినగరం, దత్తిరాజేరు, గంట్యాడ మండలాల జెడ్పీటీసీలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, వర్రినరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


రంగనాథంను సత్కరిస్తున్న రాజాం రెడ్‌క్రాస్, మానవతా సేవా సంస్థ సభ్యులు

రాజాం సిటీ: రారవే(రాజాం రచయితల వేదిక) నిర్వాహకులు, ప్రముఖ రచయిత గార రంగనాథంను రాజాం రెడ్‌క్రాస్ సంస్థ, మానవతా సేవా సంస్థ సభ్యులు కలిసి మంగళవారం సన్మానించారు. రంగనాథం రచించిన రాయరత్నం మంజూష గ్రంథానికి గాను హైదరాబాద్‌లో ఈ నెల 12వ తేదీన జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా చెన్నమనేని రంగనాయకమ్మ విశిష్ట అద్వైత సాహిత్య పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక పట్టణంలోని ఆయన నివాసానికి చేరుకున్న ఇరు సంస్థల సభ్యులు దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, మానవతా సేవా సంస్థ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, శంబరి కృష్ణలు విశిష్ట కుంకుమార్చన చేశారు. రైల్వేస్టేషన్ వద్ద నున్న వనంగుడిలో అర్చకులు నేతేటి ప్రశాంత్, మూలా పాపారావులు అమ్మవారికి మల్లెలు, జాజులు, కనకంబరాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఎవరి అంచనాలు వారివే..

- ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ
- గెలుపుపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధీమా
- జూన్ 4న ఫలితాలు వెల్లడి


లెండీ కళాశాలలో ఈవీఎంలు వద్ద పహారా కాస్తున్న భద్రతా సిబ్బంది

పూసపాటిరేగ: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. గెలుపుపై వైఎస్సార్‌సీపీ కేడర్ ధీమాగా ఉంది. నెల్లిమర్ల నియోజకవర్గంలోని 248 పోలింగ్ బూత్‌లలో ఈ నెల 13న జరిగిన పోలింగ్ సరళి బట్టి వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ఆ పార్టీ కార్యకర్తలు అంచనా వేసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి రాజకీయ పార్టీల నాయకులు అవిశ్రాంతంగా పనిచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు ప్రతీ గడపను తట్టాయి. ఎంతో కాలంగా అభివృద్ధికి దూరంగా ఉన్న గ్రామాల్లో నేడు అభివృద్ధి పరుగులు పెట్టింది. ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలతో పాటు గృహాలు మంజూరు చేసి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. అన్ని వర్గాలకు మేలు చేసిన ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో తమ మద్దతు తెలిపారని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అంటున్నారు.

నియోజకవర్గంలో 2019 సార్వత్రిక ఎన్నికలలో మొత్తం 2,01,722 ఓట్లకు గాను 1,77,811 ఓట్లు పోల్ అయ్యాయి. వైఎస్సార్‌సీపీకి 94,258 ఓట్లు, టీడీపీకి 66,207 ఓట్లు రావడంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు 28,051 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో 2,13,551 ఓట్లకు గాను 1,81,153 ఓట్లు పోలయ్యాయి. 2019 ఎన్నికలలో 88.14 శాతం పోలింగ్ నమోదు కాగా, ప్రస్తుతం 84.83 శాతం ఓటింగ్ జరిగింది.

ఫలితాల కోసం నిరీక్షణ

2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఫలితాల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. గ్రామాల్లో రచ్చబండలు, పంచాయతీల వద్ద ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంకు సబంధించి డెంకాడ మండలం జొన్నాడ సమీపంలో ఉన్న లెండీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచారు. జూన్ 4న ఫలితాలు తేలనున్నాయి. కౌంటింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గెలుపెవరిదో తెలిసేందుకు అంతవరకు నిరీక్షించాల్సిందే.

ఓటెత్తిన చైతన్యం

- ఎస్.కోట నియోజకవర్గంలోని 74 బూత్‌లలో 90 శాతానికి పైగా పోలింగ్
- 95.43 శాతంతో టాప్‌లో లింగంపేట
- 53.92 శాతంతో ఆఖరిస్థానంలో ఎస్.కోట


సంతగౌరమ్మపేట గ్రామంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

శృంగవరపుకోట: సార్వత్రిక ఎన్నికల సమరంలో పోలింగ్‌లో చైతన్యం పోటెత్తింది. పగలంతా చంద్ర నిప్పులు చెరిగిన భానుడు, సాయంత్రం ఉరుములు, మెరుపులతో భయపెట్టిన వరుణుడు వీళ్లిద్దరూ ఓటరు ముందు ఓడిపోయారు. మండే ఎండను, వణికించే వానను సైతం కాదని ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. ఉద యం 7గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ కు తెల్లారక ముందే ఓటర్లు క్యూ కట్టారు. మండే ఎండలో సైతం వెనకడుగు వేయలేదు. సాయంత్రం 6గంటల దాటినా పోలింగ్ బూత్‌లు వీడలేదు. సోమవారం రాత్రి సుమారు గంట సమయం పాటు నియోజకవర్గ వ్యాప్తంగా జడివాన కురిసి, కరెంటు లేకున్నా ఓటర్లు పట్టుబట్టి రాత్రి 10గంటల వరకూ నిల్చుని ఓటేసి కదిలారు. దీంతో ఎస్.కోటలో 856.45శాతం పోలింగ్ నమోదయ్యింది. నియోజక వర్గంలో లక్కవరపుకోటలో లింగంపేట గ్రామంలో 95.43శాతం పోలింగ్‌తో నంబర్ వన్ స్థానంలో నిలిచింది. ముషిడిపల్లి 95.26తో 2వ స్థానంలో, వెంకటరమణ పేటలోని పీఎస్(పోలింగ్ స్టేషన్) నంబర్ 60లో 94.95శాతం పోలింగ్‌తో 3వ స్థానంలో నిలిచింది. నియోజకవర్గ వ్యాప్తంగా 74 పోలింగ్ బూత్‌ల్లో 90శాతంపైగా, 116బూత్‌ల్లో 80శాతం పైగా, 29 బూత్‌ల్లో 70శాతం పైగా, 6 బూత్‌ల్లో 60శాతం పైగా పోలింగ్ నమోదయ్యింది. నియోజకవర్గంలో అతి తక్కువ పోలింగ్ ఎస్.కోటలోని పీఎస్ నంబర్ 19లో జరిగింది. ఇక్కడ 53.92 శాతమే నమో దైంది. కొత్తవలసలో పీఎస్ నంబర్ 208లో 56.91 శాతం, పీఎస్ నంబర్ 206లో 56.57 శాతంతో వరుసగా ఆఖరి రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

కొత్తవలస రూటే సెపరేటు

నియోజకవర్గంలో మేజర్ పంచాయతీ అయిన కొత్తవలస మాత్రం ఈ ఎన్నికల్లో కొత్త బాట పట్టింది. అంతటా పోలింగ్ శాతం పోటెత్తగా కొత్తవలస టౌన్‌లో పోలింగ్ సరళి అంతుబట్టలేదు. పట్టణంలోని 15 పోలింగ్ కేంద్రాల్లో 214 బూత్‌లో మాత్రం 89.40 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఏడు బూత్‌ల్లో 80శాతం లోపు, 5 బూత్‌ల్లో 70శాతం లోపు, రెండు బూత్‌ల్లో 60శాతం లోపు పోలింగ్ నమోదయ్యింది. దీంతో కొత్తవలస ఓటర్ల మనోగతం రాజకీయ విశ్లేషకులకు అంతుబట్టలేదు.

గజపతినగరం నియోజకవర్గంలో 86.44 శాతం..

బొండపల్లి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ గజపతినగరం నియోజకవర్గంలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నియోజక వర్గంలో 2,05,471 మంది ఓటర్లు ఉండగా... 1,77,612 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 87,325 మంది పురుషులు, 90,285 మంది మహిళలు, ఇతరులు ఇద్దరు ఉన్నారు. నియోజకవర్గంలోని 264 పోలింగ్ కేంద్రాల పరిధిలో 86.44 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. దత్తిరాజేరు మండలంలోని గడసాం, బొండపల్లి మండలంలోని బొండపల్లి, అంబటివలస, గొట్లాం, రయింద్రాం, దేవుపల్లి గ్రామాల్లో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. అధికారులు రాత్రి 12 గంటల తర్వాత ఈవీఎంలను విజయనగరంలోని లెండి ఇంజినీరింగ్ కాలేజ్ లోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.

మెరకముడిదాం మండలంలో 82.66 శాతం..

మెరకముడిదాం: మండలంలో సోమవారం జరిగిన సాధారణ ఎన్నికల్లో మండలంలో పోలింగ్ శాతం 82.66గా నమోదైంది. మండలంలో మొత్తం ఓటర్లు 46,868 మంది ఉండగా ఇందులో మహిళా ఓటర్లు 23,315 మంది, పురుషులు 23,553 మంది ఉన్నారు. వీరిలో 19,380 మంది పురుషులు, 19,364 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎం.రావివలస,ఉత్తరావల్లి, మెరకముడిదాం గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఈ పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 10 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది

జాగ్రత్తలు తప్పనిసరి


మాట్లాడుతున్న వైద్యాధికారి అసిరినాయుడు

రేగిడి: వేసవి ఎండల నేపథ్యంలో ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు సూచించారు. ఇదే విషయమై మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. రోజురోజుకూ ఎండల తీవ్ర పెరుగుతోందని, చిన్నపిల్లలతో ప్రయాణం చేసేటప్పుడు ఎండ తగలకుండా చూసుకోవాలని తెలిపారు. ఎండలకు శరీరంలోని నీరంతా చెమట రూపంలో బయటకు పోతుందని, నిమ్మరసం, ఫ్లూయిడ్స్ వంటివి తరచూ తాగాలన్నారు. డయేరియా వంటి వ్యాధుల బారినపడిన వెంటనే సంబంధిత ఆశావర్కర్ల ద్వారా సమాచారం తెలియజేయాలన్నారు. ప్రతిరోజూ గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన మందులు, ఆధునిక పరికరాలతో కూడిన ల్యాబ్‌లు ఉన్నాయని ఎటువంటి పరీక్షలు చేసుకోవాలన్నా పీహెచ్‌సీకి వస్తే వెంటనే చేస్తామన్నారు.